దేశానికి ప్రజలే నిజమైన సంపద

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: దేశానికి సంపద అంటే డబ్బో, బంగారమో కాదని.. అక్కడి ప్రజలు, వారి ప్రతిభే అని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో జిల్లాస్థాయి యువజనోత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధి యువత, వారి నైపుణ్యాలతోనే జోరందుకుంటుందని తెలిపారు. దేశం కోసం ప్రాణాలు లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పరంధామరెడ్డి, డీఈఓ వెంకటేశ్వర్లు, కేఎస్ఎం ప్రిన్సిపల్ జగన్మోహన్‌రాజు, జిల్లా సైన్స్ అధికారి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు. సుమారు 900 మంది యువ కళాకారులు వివిధ అంశాల్లో పోటీపడ్డారు. జానపద నృత్యాలు, గేయాలు, కవిత్వం, వక్తృత్వం, వ్యాసరచన, సైన్స్ మేళా, పోస్టర్ మేకింగ్ తదితర విభాగాల్లో ప్రతిభచూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు డీవైఎస్ఓ తెలిపారు.


జానపద నృత్యం చేస్తున్న కళాకారులు

కవిత్వం: సాయిప్రసన్న (అశ్వాపురం), వ్యాసరచన: కె.లేఖన (అశ్వారావుపేట), పోస్టర్ మేకింగ్: నాగవర్షిత్ (పాల్వంచ), వక్తృత్వం: శ్రావణి (కొత్తగూడెం), సైన్స్ మేళా: వరుణ్‌కోమల్ (ఇల్లెందు), జానపద నృత్యం (బృందం): అఖిల గ్రూప్ (అశ్వారావుపేట), జానపద నృత్యం (సోలో): పూజిత (కొత్తగూడెం), జానపద గేయాలు (బృందం): ఎం.కళ్యాణి జట్టు (కొత్తగూడెం), జానపద గేయాలు (సోలో): అంకిత (పాల్వంచ).

దశ మారాలంటే.. దిశానిర్దేశం కావాలి..!

ఈటీవీ, ఖమ్మం

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించి.. అర్హులకు లబ్ధి చేకూరేలా దిశా కమిటీ చొరవ చూపాల్సి ఉంటుంది. మూడు నెలలకు ఓసారి సమావేశం జరగాలి. 2019లో ఎన్నికైన లోక్‌సభ సభ్యుల పదవీకాలం ముగిసిందని ఇప్పటికే జిల్లా యంత్రాంగం నుంచి ప్రకటన విడుదలైంది. కొత్త కమిటీ సమావేశం నిర్వహణకు మరికొంత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఖరారు కాని తేదీలు..

దిశా కమిటీ సమావేశాలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జరగాల్సి ఉంది. ఈ ఏడాది వేసవిలో సార్వత్రిక ఎన్నికలు జరగ్గా.. జూన్ 4న ఫలితాలు వెలువడ్డాయి. ఖమ్మం ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాంనాయక్ ఎన్నికయ్యారు. లోక్‌సభ స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు ఛైర్మన్లుగా వ్యవహరిస్తారు. వీరి అధ్యక్షతన మూడునెలలకోసారి దిశా కమిటీ భేటీ కావాలి. ఈమేరకు తొలి సమావేశం జరగాల్సి ఉన్నా.. ఉభయ జిల్లాల్లో తేదీలు ఖరారు కాలేదు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై స్పష్టత కొరవడింది.



సుమారు 45 పథకాలపై సమీక్ష అవసరం

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద పల్లెల్లో అనుసంధాన రహదారులు నిర్మించాల్సి ఉంది. ఈమేరకు దిశా కమిటీ సమావేశంలో ప్రతిపాదనలు రూపొందించి.. కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రహదారులపైనా సమీక్షించాలి. ఇప్పటికే వీటి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద ఇళ్లు లేని నిరుపేదలకు నివాసయోగ్యం కల్పించాలి. ఉభయ జిల్లాల్లో వేలాది మంది సొంతింటి కల సాకారం కోసం ఎదురుచూస్తున్నారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులపైనా సమీక్షించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేయాల్సి ఉంటుంది. బ్యాంకుల రుణ లక్ష్యాలు, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులపైనా చర్చించాలి. ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల కార్యాచరణపైనా సమీక్షించాలి. మొత్తం దాదాపు 45 ప్రభుత్వ పథకాలపై చర్చించాల్సి ఉంటుంది. ఈ పథకాలన్నీ సక్రమంగా అమలుకావాలంటే.. అవసరమైన నిధులు తీసుకురావాలి. దిశా కమిటీ సమావేశం నిర్వహించి ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించి కేంద్రానికి నివేదించాలి.

సభ్యుల నియామకాలేవీ..?

ఖమ్మం జిల్లా దిశా కమిటీ ఛైర్మన్‌గా రామసహాయం రఘురాంరెడ్డి, భద్రాద్రి జిల్లా దిశా కమిటీ ఛైర్మన్‌గా పోరిక బలరాంనాయక్ వ్యవహరిస్తారు. కార్యదర్శులుగా సంబంధిత జిల్లాల కలెక్టర్లు ఉంటారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు ప్రత్యేక ఆహ్వానితులుగా కొనసాగుతారు. గతంలో లేని విధంగా ఇక నుంచి ఎమ్మెల్సీలనూ ఆహ్వానించాలనే ఆదేశాలందాయి. డీఆర్‌డీఓ, నగర మేయర్, పురపాలికల ఛైర్మన్లు, ఎంపీపీలు సభ్యులుగా ఉంటారు. అయితే ఎంపీపీల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. మరో తొమ్మిది మందిని దిశా కమిటీ సభ్యులుగా ఎంపీలు నామినేట్ చేయాలి. వీరిలో ప్రజాసేవ చేసే నలుగురు ఎన్జీఓ సభ్యులుండాలి. ఇప్పటి వరకు సభ్యులను ఎంపీలు నామినేట్ చేయలేదు. గత ఐదేళ్ల వ్యవధిలో కొవిడ్ సమయంలో రెండేళ్లపాటు దిశా కమిటీ సమావేశాలు జరగలేదు. మిగతా సమయంలో కాసింత మెరుగ్గానే సాగాయి. ఈసారి అంతకన్నా బాగా జరగాలంటే ఇద్దరు ఎంపీలు చొరవ చూపాలి. ఛైర్మన్లుగా ఉన్న ఎంపీలకు సమాచారమందించి త్వరలోనే సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ అధికారులు 'ఈనాడు'కు తెలిపారు.

ప్రాణాలు తీస్తున్న అతివేగం

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే

రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అత్యంత ప్రమాదకర ప్రాంతాల(బ్లాక్ స్పాట్స్)ను గుర్తించి ప్రమాదాల అదుపునకు చర్యలు చేపడుతోంది. కానీ, కొందరు వాహనదారుల నిర్లక్ష్యం తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు కారణమవుతోంది. ఇకనైనా రోడ్డు భద్రతే శ్రీరామరక్షగా భావించాలి.

జిల్లాలో గత ఎనిమిది నెలల్లో వరుసగా రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 330 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. 161 మంది మరణించగా, 288 మంది గాయపడి ఆసుపత్రుల పాలయ్యారు. కొందరు దివ్యాంగులుగా మారి జీవితాన్ని నష్టపోయారు. ఎక్కువ మరణాలు ద్విచక్రవాహన ప్రమాదాల వల్లే సంభవించాయి. అతివేగం, శిరస్త్రాణం ధరించకపోవడం వల్లే అత్యధిక మంది ప్రాణాలు కోల్పోయారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడం లేదు. ఈ క్రమంలో జిల్లాలోని జాతీయ, రాష్ట్రీయ రహదారులపై స్థానిక పోలీసు అధికారులు గస్తీ పెంచారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద వేగ నియంత్రికలు, హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. వేగంగా దూసుకెళ్లే మైనర్లను గుర్తించి వారి తల్లిదండ్రులకూ కౌన్సెలింగ్ ఇస్తున్నారు.



	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
ఆర్టీసీ బస్సులు	15	02	13
ప్రైవేటు బస్సులు	03	01	05
లారీలు	59	25	71
లైట్‌మోటార్స్	83	22	97
ద్విచక్రవాహనాలు	112	78	58
త్రీ వీలర్స్	29	11	31
ఇతర	29	22	13

స్థానిక రోడ్లపై అతివేగం..

ఈ ఏడాది జాతీయ, రాష్ట్రీయ రహదారుల కంటే మండలాలు, గ్రామాలను అనుసంధానించే అంతర్గత రోడ్లపైనే వాహన ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. గత నెలాఖరు వరకు జాతీయ రహదారులపై 102, రాష్ట్రీయ రహదారులపై 32, అంతర్గత రహదారుల్లో 196 ఘటనలు సంభవించాయి. రద్దీ ఉండదనే ధీమాతో మూల మలుపుల్లో మితిమీరిన వేగంతో వెళ్లే ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొంటున్నాయి. శిరస్త్రాణం ధరించని సందర్భాల్లో కొన్ని ఘటనల్లో ఇద్దరు, ముగ్గురు ప్రాణాలు కోల్పోతుండటం బాధాకరం.

జిల్లాలోని బ్లాక్‌స్పాట్స్ వద్ద ప్రమాద నివారణ చర్యలు చేపట్టడంతో పాటు, వాహనదారులకు అవగాహన కల్పించడంపై దృష్టి సారిస్తున్నాం. వాహన తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నాం. ఆటోడ్రైవర్ల నుంచి మొదలుకుని ద్విచక్రవాహనదారుల వరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సురక్షిత ప్రయాణాలు వేగ నియంత్రతోనే సాధ్యమని స్పష్టంగా సూచిస్తున్నాం. వాహనదారులు స్వీయ జాగ్రత్తలు పాటించాలి. ఎదుటి వారికీ ప్రాణనష్టం జరగకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలి. - బి.రోహిత్‌రాజు, జిల్లా ఎస్పీ



మరో ఎన్నికకు రంగం సిద్ధం



ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, కొత్తగూడెం కలెక్టరేట్: మరో ఎన్నికకు రంగం సిద్ధమవుతోంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటరు జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం 2025 మార్చి 29 నాటికి ముగియనుంది. తదుపరి ఎన్నిక కోసం ఓటరు నమోదుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 30 నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలుకానుంది.

రెండు విధాలుగా ఓటు నమోదు

రెండు విధాలుగా ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఫాం-19 ద్వారా లేదా వెబ్‌సైట్ ceotelangana.nic.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు నమోదుకు నవంబరు 6 వరకు గడువు ఉంది. నవంబరు 23న ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు ప్రకటిస్తారు. అనంతరం ఆ జాబితాపై డిసెంబరు 9 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. వాటిని డిసెంబరు 25 వరకు పరిష్కరించి అదేనెల 30న ఓటరు తుది జాబితా వెల్లడిస్తారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గానికి 2019లో జరిగిన ఎన్నికల సమయంలో 20,585 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఈసారి ఆ సంఖ్య పెరగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రతిసారీ దరఖాస్తు చేసుకోవాల్సిందే..

గతంలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నాం కదా.. ఈసారి సైతం ఓటరు జాబితాలో పేరు ఉంటుందనుకుంటే పొరపాటే.. సాధారణ ఎన్నికల ఓటరు జాబితా మాదిరిగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాను రూపొందించరనే విషయాన్ని గుర్తించాలి. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాను ప్రతిసారీ కొత్తగానే రూపొందిస్తారు. ఎన్నికల సంఘం ఓటుహక్కు నమోదుకు ఇచ్చిన గడువులోపు దరఖాస్తు చేసుకున్నవారే ఓటేసేందుకు అర్హులవుతారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అర్హులైన ఉపాధ్యాయులు ఓటుహక్కుకు నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఓటరు నమోదుకు ఎవరు అర్హులు..?

ఈ ఏడాది నవంబర్ 1 నాటికి గడిచిన ఆరేళ్లలో కనీసం మూడేళ్ల పాటు ఉన్నత పాఠశాలలు లేదా ఆపై విద్యాసంస్థల్లో బోధనానుభవం కలిగిన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు. సంబంధిత నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసిగా ఉండాలి.

అధికారులకు అందజేయాల్సినవి

2019లో జరిగిన ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో 3,435 మంది ఓటర్లు నమోదవగా.. భద్రాద్రి జిల్లాలో 2,502 మంది ఓటుహక్కు కలిగి ఉన్నారు. అత్యధికంగా ఖమ్మం నగర పరిధిలో 2,073 మంది, భద్రాద్రి జిల్లాలోని పాల్వంచలో 268 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు నమోదు చేసుకున్నారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు లేకపోయినా అన్ని అర్హతలు ఉంటే ఈ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఫాం-19తో పాటు ఫొటో, సర్వీసు ధ్రువపత్రం, ఆధార్, ఓటరు కార్డులను ఎన్నికల సంఘం సూచించిన అధికారులకు అందజేయాలి.

సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణ: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. ఇది సమష్టి బాధ్యత అని తెలిపారు. రోడ్డు భద్రతపై ఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన వివిధ శాఖల జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రోడ్ల మరమ్మతుల వల్ల ఏ ఒక్కరూ ప్రమాదం బారినపడకుండా చూడాలన్నారు. ప్రమాదాల వివరాలు, కారణాలను స్టేషన్ల వారీగా నమోదు చేయాలని సూచించారు. వాటిని విశ్లేషించి నివారణ మార్గాలు, జాగ్రత్తలపై కళాజాత బృందాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై కేజీ వీల్స్‌తో ట్రాక్టర్లు తిరగకుండా రైతులు, డ్రైవర్లతో మాట్లాడాలని తెలిపారు. క్షతగాత్రులకు సీపీఆర్, ప్రాథమిక చికిత్స అందేలా చూసేందుకు హైవేల పక్కనున్న పెట్రోల్ బంకులు, దాబాల్లో పనిచేసే సిబ్బంది, యువతకు అవగాహన కల్పించాలన్నారు. బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల సంచారం ఉన్న ప్రాంతాల్లో సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీశాఖ ఈఈ వెంకటేశ్వరరావు, జిల్లా రవాణాశాఖాధికారి సదానందం, గిరిజన సంక్షేమశాఖ ఈఈ తానాజీ, జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్, డీసీహెచ్ఎస్ రవిబాబు, మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, చిత్రంలో ఎస్పీ రోహిత్‌రాజు

ఏకోపాధ్యాయ పాఠశాలల వివరాలపై..
ఇంటెలిజెన్స్ విచారణ

ఈనాడు కథనానికి స్పందన

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: బదిలీల నేపథ్యంలో ఒక్కరే ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్న పాఠశాలలు, అక్కడి పరిస్థితిపై ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు విచారణ జరిపారు. "విందామన్నా చెప్పేవారేరి" శీర్షికన 'ఈనాడు'లో ఈనెల 24న వచ్చిన కథనానికి కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ స్పందించారు. బదిలీల ప్రక్రియ అనంతరం ఎక్కడెక్కడ ఒక్కరే ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారో విచారణ జరపాలని ఇంటెలిజెన్స్‌ను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అశ్వారావుపేట ప్రాథమిక పాఠశాల సహా ఎక్కువ మంది విద్యార్థులుండి ఒక్కరే ఉపాధ్యాయులు బోధిస్తున్న మండలంలోని వివిధ బడుల వివరాలను సేకరించినట్లు సమాచారం. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిసింది.

అయినా ఆగని వేటు..

☆ ఇటీవల కాచనపల్లి రేంజ్ పరిధి నుంచి అటవీశాఖ ఉద్యోగి ఓ ట్రాక్టర్‌లో రాత్రిపూట కలప తరలిస్తుండగా కొమరారం రేంజ్ పరిధిలోని అటవీ ఉద్యోగులు అడ్డుకున్నారు. విచారణలో కలప తరలింపునకు పాల్పడిన ఉద్యోగి సస్పెన్షన్‌కు గురయ్యారు.

☆ వన సంరక్షణ సమితి నిధుల విషయంలో గతంలో రూ.లక్షల్లో చోటుచేసుకున్న అక్రమాలపై ఎఫ్ఆర్ఓ, ఇద్దరు డీఆర్ఓలు సస్పెన్షన్‌కు గురయ్యారు. కలప తరలింపు ఘటనలోనూ డీఆర్ఓ సస్పెండ్ అయ్యారు.

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులు, సిబ్బందిలో కొందరు పక్కదారి పడుతున్నారు. విచారణలో అవినీతి ఆరోపణలు నిజమని తేలుతుండటంతో ఉన్నతాధికారులు వారిపై కొరడా ఝుళిపిస్తున్నారు. ఇల్లెందు అటవీ డివిజన్ పరిధిలో క్షేత్ర స్థాయి సిబ్బందిపై గతంలో పలుమార్లు సస్పెన్షన్ వేటుపడింది. ఇందుకు భిన్నంగా ఏకంగా ఇల్లెందు అటవీ డివిజన్ అధికారి (ఎఫ్‌డీఓ)గా పనిచేస్తున్న వెంకన్నను విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయటం చర్చనీయాంశంగా మారింది.

ఇల్లెందు అటవీ డివిజన్ పరిధిలో.. ఇల్లెందు, కొమరారం, కాచనపల్లి, గుండాల అటవీ రేంజ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో ఎఫ్ఆర్ఓలు, ఎనిమిది మంది డీఆర్ఓలు, ఎనిమిది మంది సెక్షన్ ఆఫీసర్లు, పదుల సంఖ్యలో బీట్ ఆఫీసర్లు పనిచేస్తున్నారు. తమ పరిధిలో అటవీ భూములు, వన సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత వీరిదే. కొందరు విధి నిర్వహణలో ప్రలోభాలకులోనై విచారణలో అడ్డంగా దొరికిపోతున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

'గాలి'వాటు రక్షణ.. అటవీ శాఖలోని ఏదైనా డివిజన్ పరిధిలో కలప అదృశ్యమైతే సిబ్బంది బాధ్యత వహించాలి. జరిమానా రూపంలో వారి నుంచి రికవరీ చేస్తారు. రికవరీ భారం తగ్గించుకునేందుకు కొంతమంది సిబ్బంది దారి తప్పుతున్నారు. గాలివాటు(విండ్‌ఫాల్)కు ఏవైనా చెట్లు పడిపోతే అలాంటివాటిపై విచారణ ఉండదు. తామే చెట్లను కూలుస్తూ కొందరు వాటిని 'గాలివాటు' ఖాతాలో వేస్తూ రికవరీగా చూపించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకొందరు.. అక్రమార్కులను ప్రోత్సహిస్తూ నరికిన చెట్లను విండ్‌ఫాల్ ఖాతాలో చూపుతూ పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఎక్కడో ఓచోట పట్టుకున్న కలపనూ రికవరీ ఖాతాలో చూపుతున్నారు. శాఖాపరమైన అవినీతిని అరికట్టేందుకు విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ విభాగాలున్నా అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఓ డివిజన్ పరిధిలో సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునేటప్పుడు మరో డివిజన్‌కు మార్చాలన్నది నిబంధన. కానీ ఇదే డివిజన్‌లోని మరో రేంజ్‌లో వీరిని నియమిస్తున్నారు.


ఇల్లెందులోని అటవీ డివిజన్ కార్యాలయం

మరికొందరిపై చర్యలు?

అటవీ భూముల్లో అక్రమాలపై ఇల్లెందు ఎఫ్‌డీఓను మూడు రోజుల క్రితం విధుల నుంచి తొలగించారు. జిల్లా అటవీ శాఖ అధికారులు ఈ వ్యవహారంపై అక్టోబరు మొదటి వారంలో విచారణ చేపట్టనున్న నేపథ్యంలో మరికొందరు ఉద్యోగులపై చర్యలు ఉంటాయనే సంకేతాలు వెలువడుతున్నాయి.

కొండరెడ్ల సంక్షేమానికి ప్రాధాన్యం: ఐటీడీఏ పీఓ

భద్రాచలం: భద్రాచలం మన్యంలోని కొండరెడ్ల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. యూనిట్ అధికారులతో భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి రేషన్ కార్డులు, బ్యాంకు ఖాతాలు వంటివి అందించినట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను త్వరలో అందిస్తామన్నారు. గిరిజన మ్యూజియాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇక్కడి నుంచి పీఓ హాజరయ్యారు.

పూట గడవని స్వచ్ఛ కార్మికులు

పాల్వంచ, న్యూస్‌టుడే

పురపాలికలో పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజారోగ్యాన్ని కాపాడుకోవటం సాధ్యమవుతుంది. పాల్వంచ పట్టణ పరిశుభ్రతకు పాటుపడే స్వచ్ఛ కార్మికులకు కనీస వేతనాలూ కరవయ్యాయి. జీవనోపాధికి వేరే గత్యంతరం లేని కార్మికులు.. నిత్యం వేకువజామునే విధులకు బయల్దేరి వెళ్తున్నారు. వాహనాలపై చెత్తాచెదారం తరలిస్తూ, డ్రైనేజీలు శుభ్రపరుస్తూ, విషపురుగులను సైతం లెక్కచేయకుండా పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. 2020 డిసెంబరు నుంచి వీరికి నెలవారీ వేతనాలివ్వడం మానేశారు. ఇంటింటికీ రూ.50 చొప్పున వసూలు చేసే యూజర్ ఛార్జీలతోనే కుటుంబాల్ని కార్మికులు నెట్టుకొస్తున్నారు. ఇతర పురపాలికల తరహాలో ప్రతినెలా వేతనాలివ్వాలన్నది కార్మికుల డిమాండ్. ప్రస్తుతం పురపాలికలో 27 వాహనాలపై నిత్యం 52 మంది కార్మికులు పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్నారు. తమకు జీతాలిచ్చే అంశాన్ని పరిశీలించాలని ఆయా కార్మికులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. 'కార్మికుల వేతన సమస్యను కలెక్టర్, ఎమ్మెల్యేకు నివేదించాం. న్యాయం చేస్తారని కార్మికులకు కలెక్టర్ హామీ ఇచ్చారు' అని పుర కమిషనర్ ఢాకునాయక్ తెలిపారు.


ఎమ్మెల్యే సాంబశివరావుకు సమస్యను విన్నవిస్తున్న స్వచ్ఛ కార్మికులు



'నాలుగేళ్లుగా ఎలాంటి వేతనాలు లేకుండా కేవలం యూజర్ ఛార్జీలే వసూలు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. చాలామంది ప్రజలు నెలనెలా నిర్ణీత మొత్తాన్ని ఇవ్వడం లేదు. మా కష్టాల్ని చూసైనా మిగతా మున్సిపాలిటీల్లో మాదిరిగా వేతనాలు ఇవ్వాలి.'
- బాలాజీ, కార్మికుడు



'రోజువారీగా పారిశుద్ధ్య పనులు చేస్తున్నప్పటికీ మాపై అధికారులు వివక్ష చూపడం తగదు. రక్షణ పరికరాల్లేక అనారోగ్యాల బారిన పడుతున్నాం. నెలవారీగా రూ.2,000-3,000 మాత్రమే యూజర్ ఛార్జీలు వసూలవుతున్నాయి. ఈమొత్తంతో కుటుంబం ఎలా గడుస్తుంది?'
- నాగమణి



'కొవిడ్ కష్టకాలంలో సైతం ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య పనులు నిర్వహించాం. నిత్యం పొద్దున్నే విధులకు హాజరవుతున్నాం. గతంలో మాదిరిగా జీతాలు ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. కనీసం బూట్లు, చేతి తొడుగులు వంటి రక్షణ పరికరాలు ఇవ్వడం లేదు. మా జీవనం కష్టంగా మారింది'.
- పార్వతి

చిన్నారుల కిడ్నాప్ వదంతులతో కలకలం

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఇంట్లోంచి బయటకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు కిడ్నాప్ అయినట్లు వదంతులు రావడంతో పట్టణంలోని బూడిదగడ్డ ఏరియాలో కలకలం రేగింది. చివరకు చిన్నారుల జాడ దొరకడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం.. పురపాలక కార్యాలయంలో ఏఈగా పని చేస్తున్న రాముకు మూడు, ఐదేళ్ల వయసున్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఉదయం పూట పెద్దలకు తెలియకుండా వారు ఇంట్లోంచి బయటకు వెళ్లారు. ఏఈ కుటుంబీకులు, ఇరుపొరుగు వెతుకుతుండగానే.. మరోవైపు చిన్నారులు కిడ్నాప్ అయ్యారనే వదంతులు వ్యాపించాయి. ఈ విషయం తెలియడంతో డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహ్మాన్, ఒకటి, మూడో పట్టణ ఠాణాల ఎస్‌హెచ్‌ఓలు కరుణాకర్, శివప్రసాద్‌లు సిబ్బందితో కలిసి ఏఈ ఇంటికి వచ్చారు. స్థానికులను విచారించారు. చిన్నారులు సమీపంలోని ఏఈ స్నేహితుడి నివాసంలో ఉన్నట్లు గుర్తించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులకు కౌన్సెలింగ్ ఇచ్చిన డీఎస్పీ.. వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పట్టాల వెంట.. పచ్చందాల పరుగు!



చుట్టూ పచ్చందాలు, దూరాన కొండల మధ్యలోంచి బీడీసీఆర్ (కొత్తగూడెం)-సత్తుపల్లి రైలుమార్గం వెళ్తోంది. సుజాతనగర్ మండలం వేపలగడ్డ వద్దనున్న ఆర్వోబీ పైనుంచి ఈ సుందర దృశ్యాన్ని వీక్షించేందుకు వాహనదారులు ఆసక్తి కనబర్చుతున్నారు. ఉత్సాహంగా సెల్ఫీలు దిగుతున్నారు.

– కొత్తగూడెం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే

నింగీ నేల.. కలిసేలా జలకళ



కిన్నెరసాని రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 407 అడుగులకు చేరింది. ఎగువన కురిసిన వర్షాలకు ప్రస్తుతం పెద్దఎత్తున వరద వచ్చి చేరుతోంది. అధికారులు 7 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టులోని జలకళను చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. నింగి, నేలను కలుపుతున్నట్లు కనిపించే జలాశయం అందరినీ ఆకట్టుకుంటోంది.

– పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

వరదలకు చలించని వారధి



ఇటీవల వర్షాలతో పోటెత్తిన వరద ఉద్ధృతి ధాటికి భారీ వంతెనలు సైతం గతి తప్పుతున్నాయి. కానీ కొన్ని ప్రాంతాల్లో ఏళ్ల క్రితం నిర్మించినవీ పటిష్ఠంగా ఉంటూ అబ్బురపరుస్తున్నాయి. కొత్తగూడెం-విజయవాడ రహదారిలో రుద్రంపూర్ సమీపంలో రైల్వేలైను కింద నుంచి వెళ్లే వంతెన (అండర్ బ్రిడ్జి) ఈ కోవకే చెందుతుంది. దీన్ని బ్రిటీషు కాలంలో రాళ్లతో నిర్మించారు. రుద్రంపూర్‌తో పాటు జీఎం కార్యాలయం, పీవీకే-5 గని, మాయాబజార్, 4 ఇంక్లైన్ వెళ్లేందుకు దీని గుండానే రాకపోకలు సాగిస్తున్నారు.

– కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

దివ్యాంగుల గోడు.. కల్పించాలి గూడు



రెండు కాళ్లు లేని కొణతం అమృతరావు

ఇన్‌ఫెక్షన్‌తో ఆయన రెండు కాళ్లు తీసేశారు. సోదరులిద్దరూ దివ్యాంగులు. అంతా అద్దె ఇంట్లో తలదాచుకుంటున్నారు. తమకు ఇల్లు మంజూరు చేసి నీడ కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటున్నారు. ఖమ్మం అర్బన్ మండలం గోపాలపురానికి చెందిన కొణతం అమృతరావు కుటుంబం నల్గొండ నుంచి వలస వచ్చింది. తండ్రి ఎన్నెస్పీలో ఫోర్‌మెన్‌గా పని చేసి మరణించారు. గతంలో ఎన్నెస్పీ క్యాంపులోని క్వార్టర్స్‌లో ఉండేవారు. ఏడేళ్ల కిందట క్వార్టర్లు కూల్చివేయడంతో దిక్కుతోచని స్థితిలో గోపాలపురంలో అద్దె ఇంటిలో తలదాచుకుంటున్నారు. అమృతరావుకు గతంలో ఇన్‌ఫెక్షన్ సోకడంతో రెండు కాళ్లు తొలగించారు. చేతులు వంకర్లు పోయాయి. కొంతకాలం కిందట ఈయన భార్య చనిపోయింది. అన్న అనీల్‌కుమార్ మానసిక, తమ్ముడు కిరణ్ శారీరక దివ్యాంగులు. అంతా కలిసే ఉంటున్నారు. ఆసరా పింఛనుతో బతుకు వెల్లదీస్తున్నారు. తమకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

– ఖమ్మం నగరం, న్యూస్‌టుడే

పరిశోధన స్థానాన్ని పరిశీలించిన ఏడీఆర్

మధిర, న్యూస్‌టుడే: మధిర వ్యవసాయ పరిశోధన స్థానాన్ని వరంగల్‌కు చెందిన అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(ఏడీఆర్) ఆర్.ఉమారెడ్డి బుధవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ పరిశోధన స్థానంలో ప్రయోగాత్మకంగా సాగుచేస్తున్న పెసర, మినుము, వరి పంటలు ముంపునకు గురై దెబ్బతిన్నాయి. పెసర, మినుము, పూత, కాత దశలో ఉన్న సమయంలో వరద ఉద్ధృతికి పాడయ్యాయి. దీంతో ఆయన పరిశోధన స్థానానికి వచ్చి క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించి ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణీదేవితో మాట్లాడి నష్టాన్ని అంచనా వేశారు. ఆయన వెంట పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఉన్నారు.



పరిశోధన స్థానంలో పైర్లను పరిశీలిస్తున్న ఏడీఆర్ ఉమారెడ్డి

కళ్లుగప్పి.. నల్లబంగారాన్ని కొల్లగొట్టి..



కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంటులో లారీల్లో లోడవుతున్న బొగ్గు (పాత చిత్రం)

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

ఎన్ని చర్యలు తీసుకుంటున్నా సింగరేణిలో బొగ్గు అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. అక్రమార్కులు దొడ్డిదారిన ఉత్పత్తిని తరలించేందుకు కొత్త మార్గాలను కనిపెడుతున్నారు. ఇటీవల భూపాలపల్లి నుంచి రామగుండం చేరాల్సిన బొగ్గును అక్రమ మార్గంలోకి మళ్లించిన విషయం వెలుగుచూసింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లోని భూగర్భ, ఉపరితల గనుల నుంచి రోజుకు 1.7 లక్షల టన్నులకు పైగా బొగ్గును వెలికితీస్తుంటారు. దీన్ని గనుల నుంచి బంకర్లకు డంప్ చేసే క్రమంలో, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అంతర్గతంగా తరలించేందుకు సుమారు వెయ్యి వరకు టిప్పర్లు, లారీలను వినియోగిస్తున్నారు. సాధారణంగా ఏదైనా వాహనం అనుమతించిన మార్గంలో కాకుండా ఇతర దారులకు వెళ్తే వెంటనే కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయ విజిలెన్స్ అధికారులకు సందేశం వస్తుంది. నిర్ణీత మార్గంలోనే వెళ్లేలా చూసేందుకు ఆయా వాహనాలకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం(జీపీఎస్)లను అమర్చారు. ఈ సాంకేతికత వ్యవస్థ ఉన్నా ఉత్పత్తిని అక్రమ మార్గంలో తరలిస్తున్నారని కొద్దిరోజుల క్రితం భూపాలపల్లి ఘటనతో అధికారులు గుర్తించారు.

పరికరాన్ని పట్టుకుంటే సందేశం వచ్చేలా..

వాహనానికి బిగించి ఉన్న జీపీఎస్ వ్యవస్థను విప్పితే వెంటనే విజిలెన్స్ కార్యాలయానికి సంక్షిప్త సందేశం అందేలా సాంకేతికతను అందుబాటులోకి తేవాలని సంస్థ నిర్ణయించింది. సంబంధిత విభాగం అధికారులను ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు. ఈ అంశంపై సంస్థలో భారీ కసరత్తు జరుగుతోందని తెలుస్తోంది. అధునాతన సాంకేతికతతో అక్రమాల్ని నిలువరిస్తామని సింగరేణికి చెందిన ఓ డైరెక్టర్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

వ్యవస్థను మార్చి.. అధికారులను ఏమార్చి

వాహనాలకు బిగించిన జీపీఎస్ పరికరాన్ని లారీ సిబ్బంది తొలగిస్తున్నారు. దాన్ని వేరే వాహనంలో ఉంచి అనుమతించిన మార్గంలో పంపుతున్నారు. అక్కడ్నుంచి బొగ్గు లారీని ఇతర ప్రాంతానికి తరలించి కొంత మొత్తాన్ని దిగుమతి చేసి దండుకుంటున్నారు. భూపాలపల్లి ఉదంతంలో ఏకంగా 150 టన్నుల బొగ్గును అడవిలో డంప్ చేయడాన్ని గమనించిన సింగరేణి అధికారులు అవాక్కయ్యారు. భూపాలపల్లి ఏరియా తరహాలో ఈ రకమైన దందా ఇంకా ఇతర జిల్లాల్లోని ఏరియాల్లో ఎక్కడైనా జరుగుతుందా? అని స్థానిక అధికారులు వెంటనే సోదాలు చేపట్టారు. బొగ్గు చౌర్యానికి అవకాశాలున్న మార్గాల్లో తిరిగే వాహనాల జీపీఎస్‌లను తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏ వాహనాన్నీ వదలకుండా నిఘా పటిష్ఠపరచాలని నిర్ణయించారు.

నేడు పెసల కొనుగోలు బంద్

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లాలో వర్షాలు కురుస్తున్న కారణంగా గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పెసల కొనుగోలు ఉందని మార్కెట్ కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న తిరిగి కొనుగోలు ప్రారంభిస్తామని, రైతులు గమనించాలని సూచించారు.

ముగిసిన సీబీఎస్ఈ క్లస్టర్ ఖోఖో టోర్నమెంట్

నిజాంపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్ బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ పాఠశాలలో నాలుగు రోజులుగా జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ ఖోఖో టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 200 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 5,500 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరు పోటీలు జరిగాయి. విజేతలుగా నిలిచిన 12 జట్లకు బుధవారం బహుమతుల ప్రదానం జరిగింది. అండర్-17 బాలుర విభాగంలో విజేతలుగా నిలిచిన వారిలో బ్లూమింగ్ మైన్స్ (ఖమ్మం), అండర్-19 బాలికల విభాగంలో హార్వెస్ట్ పాఠశాల (ఖమ్మం), బాలుర విభాగంలో డీపీఎస్ (ఖమ్మం) జట్లు ఉన్నాయి.

ఆగని ఆక్రమణల పర్వం

వైరా, న్యూస్‌టుడే: వైరాలోని శాంతినగర్ రైతువేదిక నుంచి అయ్యప్పక్షేత్రం వైపు ఎన్ఎస్పీ స్థలాల ఆక్రమణ పర్వం కొనసాగుతోంది. రెండు రోజులుగా స్థానికంగా ఉంటున్న పలువురు ఆక్రమించుకునే ప్రయత్నంలో హద్దులు వేసుకుంటున్నారు. దీంట్లో భాగంగా బుధవారం పలువురు ఎన్ఎస్పీ కాలువ తమదేనంటూ హద్దులు పాతడం విశేషం. ఆక్రమణలు తొలగించకపోతే చర్యలు తీసుకుంటామంటూ రెవెన్యూ అధికారులు బుధవారం సంఘటన స్థలంలో స్థానికులకు వివరించారు. ఆక్రమణలు తొలగించాలంటూ స్పష్టంగా సూచించారు. మధిర రోడ్డు నుంచి శాంతినగర్ వరకు ఎన్ఎస్పీ కాలువలపై గతంలో వేసిన ఇళ్లు వాటి వివరాలను అధికారులు సేకరించారు.

రాములోరికి ఘనంగా తిరుమంజనం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామిని బుధవారం తిరుమంజనం చేసి భజనలతో పూజించారు. అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించి నామార్చన నిర్వహించారు. క్షేత్ర విశిష్టతను ప్రవచనం చేసిన తీరు మంత్రముగ్ధులను చేసింది. నిత్యకల్యాణ క్రతువులో భాగంగా మాంగళ్యధారణ రమణీయమై కనిపించింది. తలంబ్రాల వేడుక అమితానందాన్ని అందించింది. దర్బారు సేవ తన్మయత్వాన్ని నింపింది. భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వైదిక పెద్దలు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీస్సులు పలికారు. 26న పునర్వసు పురస్కరించుకుని స్నపన తిరుమంజనం ఉంటుంది. 27న పుష్యమి సందర్భంగా సీతారామ పట్టాభిషేకం చేస్తారని వైదిక పెద్దలు తెలిపారు. ఇదే రోజున సంధ్యా హారతి అందిస్తారు.

టేబుల్ టెన్నిస్ జంబో జట్టు



టీటీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: 'ఖమ్మంలో టేబుల్ టెన్నిసా' అనే విమర్శ నుంచి 'ఇంతమంది టీటీ క్రీడాకారులా' అనే దశకు వీరి సంఖ్య చేరింది. బుధవారం పటేల్ స్టేడియంలో అండర్ 19 టేబుల్ టెన్నిస్ బాల, బాలికల జట్ల ఎంపిక కోసం పోటీలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో క్రీడాకారులు తరలి వచ్చారు. స్టేడియంలోని శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది. కేవలం సంఖ్య మాత్రమే కాకుండా గత ఏడాది జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్ 19 విభాగంలో రెండు రజత పతకాలు అందాయి. ఈసారి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తామని కోచ్ సాంబమూర్తి చెప్పారు. పోటీల ముగింపు కార్యక్రమంలో డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం అండర్ 19 కార్యదర్శి మూసాకలీం జిల్లా జట్టుకు ఎంపికైన వారి వివరాలను వెల్లడించారు. బాలుర జట్టులో పి.జ్వలిత్, ఎస్.రాధాకృష్ణ, మోహిత్, తరుణ్ ఉన్నారు. బాలికల జట్టులో అమృత, నవ్య, బి.కుమారి, సుప్రియ, చంద్రకారిణి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన గోడపత్రికలు



చర్ల, న్యూస్‌టుడే: చర్లతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా బుధవారం రాత్రి గోడపత్రాలు వెలిశాయి. ఆదివాసీ హక్కుల సంఘం పేరిట వెలిసిన ఈ గోడపత్రాల్లో ఏం సాధించిందని మావోయిస్టు పార్టీ 20 ఏళ్ల సంబురాలు చేసుకుంటోందని ప్రశ్నించారు.

'ఎన్‌కౌంటర్ బూటకం'

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో ఈనెల 24 తేదీన జరిగిన ఎన్‌కౌంటర్ ఓ బూటకమని సీపీఐ మావోయిస్టు దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ పేరున బుధవారం మీడియాకు ఓ లేఖ విడుదల చేశారు. చింతవాగు నదిలో చేపల వేటకు వెళ్లి నది ఒడ్డున నిద్రిస్తున్న గ్రామస్థులపై పోలీస్‌లు కాల్పులు జరిపారని ఆరోపించారు. ఆ సమయంలో కవాసి బీముడు తన ప్రాణాలను కాపాడుకోవడానికి పరిగెడుతుండగా కాల్చడంతో మృతి చెందాడని తెలిపారు. గ్రామస్థులు అతని మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీశారని వెల్లడించారు. కవాసి బండి, మడ్వి భీమాను బలవంతంగా భద్రతా బలగాలు అరెస్టు చేసి తీసుకెళ్లారని ఆరోపించారు. పోలీస్‌లు పట్టుకున్న వారిని రక్షించడానికి వెళ్లిన గ్రామస్థులపై దాడులు చేసి రూ.15 వేలు దోచుకున్నారని లేఖలో ఆరోపించారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి దుర్మరణం



వెంకటేశ్వరరావు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతిచెందిన ఘటన అశ్వారావుపేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై యయాతి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలేనికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్వరరావు(22) ట్రాక్టర్ డ్రైవర్. అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం నుంచి పామాయిల్ గెలలను ట్రాక్టరులో అశ్వారావుపేట ఫ్యాక్టరీకి బుధవారం తరలిస్తున్నాడు. మార్గం మధ్యలో సత్తెమ్మ ఆలయం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. వెంకటేశ్వరరావు మీదుగా ట్రక్కు టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి వరలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు చెప్పారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

చింతకాని, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చింతకాని మండలం పందిళ్లపల్లి రైలు నిలయం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. మృతుడి వయసు 40 సంవత్సరాలు ఉండవచ్చని రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. అన్నం సేవాసమితి సభ్యులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత



గంజాయి, నిందితుడిని చూపిస్తున్న ఏఈఎస్ వేణుగోపాల్‌రెడ్డి

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: ఆబ్కారీ టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం 24.35 కిలోల గంజాయి పట్టుకొంది. సహాయ అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... టాస్క్‌ఫోర్స్ బృందం నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ నుంచి బస్టాండు వరకు తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తి వద్ద ఉన్న మూటలు పరిశీలించగా అందులో గంజాయి ఉంది. నిందితుడిపై కేసు నమోదు చేశారు. తనిఖీ బృందంలో సి.ఐ. కరుణశ్రీ, ఎస్సై సరిత సిబ్బంది ఉన్నారు.

మణుగూరు సాంస్కృతికం: ద్విచక్ర వాహనాలపై గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను మణుగూరు సమీపంలో బుధవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు అరెస్టు చేశారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ తిరుపతి వివరాల ప్రకారం.. సీలేరు నుంచి ఐదుగురు వ్యక్తులు గంజాయిని తీసుకువస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో మణుగూరులోని అర్బన్ పార్క్ వద్ద తనిఖీలు చేపట్టారు. రెండు ద్విచక్ర వాహనాలపై నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా వారిని తనిఖీ చేశారు. దీంతో సుమారు రూ.4 లక్షల విలువైన 12.5 కిలోల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన మహబూబాబాద్, జనగాంలకు చెందిన రేగు సంపత్, గందమళ్ల లవ్‌కుమార్, బందెల సాయికుమార్, బోడ వంశీలతోపాటు పరారీలో ఉన్న మరో వ్యక్తి జానీ మొత్తం ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్, హెడ్‌కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుళ్లు హరీష్, సుధీర్, వెంకట్, హనుమంతరావు, విజయ్ పాల్గొన్నారు.

హైడ్రోజన్ సల్ఫైడ్ విష వాయువు వాసన

◆ ఇబ్బందులు పడ్డ కుమ్మరిగూడెం ప్రజలు

అశ్వాపురం, న్యూస్‌టుడే: కుమ్మరిగూడెం గ్రామ ప్రజలు మంగళవారం అర్ధరాత్రి స్థానిక భారజల ప్లాంటులో భారజలం ఉత్పత్తికి వినియోగించే హైడ్రోజన్ సల్ఫైడ్ విషవాయువు విడుదలైనప్పుడు వచ్చే కుళ్లిన కోడిగుడ్ల వాసనతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరిగ్గా రాత్రి 11 గంటలకు వాసన రావడం మొదలైంది. సుమారు 45 నిమిషాల వరకు వచ్చింది. అదృష్టవశాత్తు ఎవరూ అస్వస్థతకు గురికాలేదు. విషవాయువు ఏమైనా లీకై ఉంటుందా? అనే విషయం తెలియడం లేదు. ఎవరూ నిర్ధారించడం లేదు. కానీ లీకై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలిసి మండల పరిషత్, రెవెన్యూ అధికారులు బుధవారం కుమ్మరిగూడెం గ్రామం సందర్శించారు. గ్రామ ప్రజలు వారికి విషయం వివరిస్తూ సంతకాలతో కూడిన వినతిపత్రాలు సమర్పించారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

★ భారజల ప్లాంట్ జీఎం ఎస్.జగ్గారావును ఈ విషయమై 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. విష వాయువు వాసనతో కుమ్మరిగూడెం గ్రామ ప్రజలు ఇబ్బందులు పడిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిశీలన జరుపుతున్నామని చెప్పారు. ఆ రాత్రే తమ అధికారులు కుమ్మరిగూడెం గ్రామం సందర్శించి పరిశీలన జరిపి వచ్చారన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు గ్రామ ప్రజలు వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. త్వరలోనే కుమ్మరిగూడెం గ్రామంలో దీనిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు.

దేవీ నవరాత్రులకు ఏర్పాట్లు



శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న సహాయ కమిషనర్, ఈఓ, ధర్మకర్తలు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.వీరాస్వామి ఆధ్వర్యంలో శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల గోడపత్రికలు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


హుండీ ఆదాయం రూ.29 లక్షలు

జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం బుధవారం లెక్కించారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.వీరాస్వామి పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో 91 రోజులకు రూ.29,51,477 వచ్చినట్లు ఈఓ జగన్మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కె.విజయకుమారి, ఆలయ అర్చకులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ఠాణాలో బుధవారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సత్తుపల్లికి చెందిన ఓ బాలికతో బాబాయి వరుస అయ్యే షేక్ పాషామియా అనే వ్యక్తి బుధవారం సాయంత్రం అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయమై బాధిత కుటుంబ సభ్యులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాషామియాపై పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చడంతో రిమాండ్ విధించారు.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
పత్తి	5,800	7,211	7,000
పెసలు	4,000	7,200	7,500
ఏసీ ఎండుమిరప	10,300	20,000	17,000
ఎండుమిరప	10,000	17,000	15,500
ఏసీ తాలుమిరప	8,500	9,400	9,000

చేతులెత్తి మొక్కుతున్నా.. చేయూతనివ్వరూ!

సత్తుపల్లి, న్యూస్‌టుడే

ఇంటి పెద్ద కొవిడ్‌తో మృతిచెందగా ఇల్లాలు అనారోగ్యంతో మంచాన పడింది. గ్రామస్థులకు ఆరోగ్య రక్షణ కోసం పనిచేసిన ఆమె ఇప్పుడు విషమ పరిస్థితిలో ఉన్నారు. నెలనెలా అయ్యే మందుల ఖర్చులకూ డబ్బుల్లేక ఆ పేద కుటుంబం ఆసన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది.

సుమారు నాలుగు నెలలుగా

సత్తుపల్లి అంబేడ్కర్‌నగర్‌లో చల్లపల్లి సుగుణరావు, సుజాత దంపతులు నివాసం ఉండేవారు. వీరికి కుమార్తె శ్రుతి, కుమారుడు శాంతకుమార్ సంతానం. సుగుణరావు ఆటో నడుపుతుండగా సుజాత కాకర్లపల్లి రోడ్డు పరిధిలో ఆశా కార్యకర్తగా పనిచేసేవారు. 2020లో కొవిడ్‌తో సుగుణరావు మృతిచెందడంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. పిల్లలను సుజాత చదివించుకుంటూ వస్తున్నారు. ఆమె కూడా అనారోగ్యానికి గురవగా హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



మంచానికి పరిమితమైన చల్లపల్లి సుజాత

మానవీయం

మెదడులోని నరాల ఇన్‌ఫెక్షన్‌తో సుజాత బాధపడుతున్నట్లు తేలింది. శస్త్రచికిత్సకు ఆరోగ్యశ్రీ వర్తించకపోవటంతో రూ.5లక్షల వరకు బయట అప్పులు చేసి ఆపరేషన్ చేయించుకున్నారు. అప్పట్లో మందులు, ఇంజెక్షన్లు అధిక మోతాదులో వాడటంతో తొంటి జాయింట్ ఎముకల్లో రక్తం సరఫరా కాక ఎముక దెబ్బతినడంతో శస్త్రచికిత్స చేసి స్టీల్ రాడ్ వేశారు. ఫలితంగా మరో ఆరు నెలల వరకు విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఆమె మంచానికే పరిమితమై ఇంట్లో గడవక, మందులకు డబ్బులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా నెలకోసారి రూ.40వేలు, రూ.45వేల విలువైన రెండు ఇంజెక్షన్లను నాలుగు నెలలపాటు చేయించుకోవాల్సి రావడంతో నానా తంటాలు ఎదుర్కొంటున్నారు. నెలనెలా రూ.4వేలు మందులు, ఇంజెక్షన్లు చేయించుకునేందుకు దాతల నుంచి ఆమె సాయాన్ని అర్థిస్తున్నారు.

దాతలు సంప్రదించాల్సిన నంబర్: 93944 50050

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

స్నేహితుడి కుటుంబానికి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అశ్వాపురం, న్యూస్‌టుడే: భీమునిగుండం కొత్తూరులో ఆటెది రాజశేఖరరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ఆయన దశదినకర్మలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2006 విద్యా సంవత్సరంలో తన తరగతి చదువుకున్న ఆయన స్నేహితులు, పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. తమవంతుగా రూ.67,200 ఆర్థికసాయం అందజేశారు. పూర్వవిద్యార్థులు కమటం శంకర్, రెడ్డి సతీశ్, కృష్ణకాంత్, బద్దం అనూష, శారద, సరిత, పిట్ట నరేశ్, రామగిరి ఏకాంబరం, మహేశ్, శ్రీను, లాలన్‌రాజ్ పాల్గొన్నారు.

ఆసుపత్రుల తనిఖీ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులను, స్కానింగ్ సెంటర్లను డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆర్.చైతన్య బుధవారం తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. స్కానింగ్ పరీక్షలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: తూరుబాక సమీపంలో ఇటీవల కురిసిన వర్షానికి కల్వర్టు దెబ్బతింది.
- స్థానికులు

సమాధానం: కల్వర్టును పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపడతాం.
- హరిలాల్, ర.భ. శాఖ డీఈ, దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

విద్యుత్తు సమస్యకు పరిష్కారం

స్పందనకు వందనం

చర్ల, న్యూస్‌టుడే: చర్లలోని పశు వైద్యశాల వీధి, గణేశ్‌నగర్‌లో విద్యుత్తు సరఫరాలో అంతరాయంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈనెల 20న ప్రచురితం కావడంతో ఏఈ యోహాన్ ఆదేశాలతో సిబ్బంది విద్యుత్తు నియంత్రికకు మరమ్మతులు చేశారు. ఎట్టకేలకు విద్యుత్తు నియంత్రిక మరమ్మతులు పూర్తి చేశారు. విద్యుత్తు నియంత్రికలో మళ్లీ సమస్య తలెత్తితే మరొకటి ఏర్పాటు చేస్తామని బుధవారం ఏఈ తెలిపారు.

గుంతకు మరమ్మతులు

దమ్మపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జయలక్ష్మీ థియేటర్ ఎదురుగా పాల్వంచ వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతకు ర.భ. శాఖ సిబ్బంది బుధవారం తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ఈ సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం మీతోడుగా' శీర్షిక ద్వారా స్థానికులు పంచాయతీ కార్యదర్శి సురేశ్ కుమార్‌కు బుధవారం తెలుపగా.. ఆయన వెంటనే ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి పనులు ఏయించారు. డీఈఈ శ్రీనివాస్, సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఈవోల బాధ్యతల స్వీకరణ

అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, న్యూస్‌టుడే: అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా ఎర్రగుంట జడ్పీ పాఠశాల హెచ్.ఎం. ఆనందకుమార్, పెద్దవాగు జడ్పీ పాఠశాల హెచ్.ఎం. ఎం.సత్యనారాయణలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వారికి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

పినపాక, న్యూస్‌టుడే: పినపాక ఎంఈవోగా కె.నాగయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏడూళ్ల బయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయనకు ఎంఈవోగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

కమ్యూనిజం ప్రజల్లో ఎప్పుడూ ఉంటుంది: సీపీఎం


అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి వందన సమర్పణ చేస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలం పట్టణం, దుమ్ముగూడెం, చర్ల, న్యూస్‌టుడే: కమ్యూనిజం ప్రజల్లో ఎప్పుడూ ఉంటుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలం అశోక్‌నగర్ కాలనీ, చర్లలో బుధవారం నిర్వహించిన శాఖ మహాసభల్లో మాజీ ఎంపీ డా.మిడియం బాబూరావుతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడారు. ముందుగా స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సభలో జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పాల్గొని మాట్లాడారు. భద్రాచలం అభివృద్ధి, కరకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎంబి నర్సారెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించగా అమరవీరుల చిత్రపటాలకు గడ్డం స్వామి, రామారావు ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాగరాజు, సీతాలక్ష్మి, సున్నం గంగ, రాఘవయ్య పాల్గొన్నారు.

✦ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సీపీఎం శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య పేర్కొన్నారు. బీమవరంలో సీపీఎం శాఖ మహాసభలు బుధవారం జరిగాయి. నాయకులు మర్మం చంద్రయ్య, తిరుపతిరావు, వెంకటేశ్వర్లు, అర్జున్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వారధుల చెంత.. రక్షణేదీ?

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

నియోజకవర్గంలో వాగులపై వంతెనలున్నా.. వాటి మీదుగా ప్రయాణించాలంటే ప్రాణాల్ని అరచేత పట్టుకోవాల్సిందే. పెద్దపెద్ద వాగుల వద్ద సైతం వారధులకు రక్షణ గోడలు (రెయిలింగ్) లేకపోవడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారధులను పటిష్ఠపరచాలని ప్రజలు కోరుతున్నారు.

✦ అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం- గాండ్లగూడెం మధ్య పెద్దవాగుపై దశాబ్దాల క్రితం కట్టిన వంతెన రెయిలింగ్ ఏనాడో విరిగిపోయింది. వర్షాకాలంలో రాత్రిళ్లు ఆ మార్గంలో బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది.

✦ అన్నపురెడ్డిపల్లి మండలంలోని వెంకటాపురం-సత్తుపల్లి మార్గంలో రాళ్లవాగు అలుగు నీరు రోడ్డుపై నుంచి పారుతోంది. దీంతోపాటు రోడ్డు ఒక పక్కకు కుంగిపోయింది. వర్షాకాలం ఆ మార్గంలో అలుగు నీళ్ల పారకంతో పాకుడు పట్టి వాహనాలు జారుతున్నాయి. అబ్బుగూడెం-బత్తులగూడెం మధ్య ఎదుళ్లవాగుపై వంతెనకు రెయిలింగ్ లేదు.

✦ ములకలపల్లి-దమ్మపేట మార్గంలో పాములేరు వాగుపై రక్షణ గోడలు ఏళ్ల క్రితం దెబ్బతిన్నాయి. ఆనాటి నుంచి కొత్తగా రెయిలింగ్ ఏర్పాటు చేయలేదు. అసలే మలుపు, ఆపై ప్రయాణం ప్రమాదంగా మారుతోంది. సత్యంపేట నుంచి రామానుజవరంపురం మధ్య వంతెనపై రెయిలింగ్ అసలు నిర్మించలేదు.

✦ చంద్రుగొండ మండలంలో పోకలగూడెం-బాల్యాతండా మధ్య వచ్చా అంచులు ప్రమాదకరంగా ఉన్నాయి. అన్నారం నుంచి మాలబంజర మార్గంలో ఎదుళ్లవాగుపై వంతెన నిర్మించారు. రెయిలింగ్ పనులు మరిచారు.

✦ దమ్మపేట మండలంలో గుత్తవారిగూడెం-తాళ్లమడ మార్గంలో చెరువు అలుగు పారుతోంది. ఇక్కడ రెయిలింగ్ లేకపోవడం, అలుగు నీటితో పాకుడు పట్టి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.


నారాయణపురం-గాండ్లగూడెం మధ్య పెద్దవాగుపై రెయిలింగ్ లేని వంతెన

అధికారి ఏమన్నారంటే..

రహదారులు భవనాల శాఖ డీఈఈ శ్రీనివాసరావు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. వరద నష్టాల్లో భాగంగా దెబ్బతిన్న వంతెనల మరమ్మతులు, నూతనంగా రెయిలింగ్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపుతున్నామని చెప్పారు. నిధులు మంజూరు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

వంతెన పక్కన గుంత.. ప్రయాణం చింత



మొండికుంట-భద్రాచలం ప్రధాన రహదారి మార్గంలో రామచంద్రాపురం వద్ద కడియాల బుడ్డి వాగుపై ఉన్న వంతెన వద్ద ప్రధాన రహదారి ఓ వైపు పూర్తిగా కొట్టుకుపోయి గండి పడింది. ప్రమాదభరితంగా, రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు, గోదావరి వరదలకు కడియాల బుడ్డి వాగు ఉద్ధృతంగా పొంగిపొర్లి ప్రవహించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ బి.హరిలాల్‌ను 'న్యూస్‌టుడే' ప్రశ్నించగా... ఈ మేరకు ప్రతిపాదనలు పంపామన్నారు. – మణుగూరు గ్రామీణం, న్యూస్‌టుడే

ఆలోచన అమలు.. కలుపు తెరమరుగు



కుర్వపల్లి కొత్తూరులో మడకం రాములు అనే రైతు తనకున్న పదెకరాల్లో పామాయిల్ మొక్కలు వేశాడు. మొక్కల చుట్టూ కలుపు పెద్ద సమస్యగా మారింది. మీటరు పొడవు, మీటరు వెడల్పు ఉన్న ఓ గ్రీన్‌నెట్‌ను ముక్కలు ముక్కలుగా కత్తిరించి దానికి మధ్యలో రంధ్రం చేసి పామాయిల్ మొక్కల చుట్టూ పెట్టారు. తొలుత ప్రయోగం కోసం ఆయన సుమారు ఓ పదిహేను మొక్కలకు ఇలా ఏర్పాటు చేశాడు. ఎరువులు వేయాలంటే గ్రీన్‌నెట్‌ను పైకి లేపి కింద ఎరువులు వేస్తున్నాడు. నీరు పెట్టడానికి ఇబ్బంది ఉండటం లేదు. ఫలితం బాగుంటే పదెకరాల్లోని పామాయిల్ మొక్కలకు ఇలాగే ఏర్పాటు చేయాలనుకుంటున్నాడు. ఏఓ సాయి శంతన్‌కుమార్ మాట్లాడుతూ.. మల్చింగ్ ఖరీదైన నేపథ్యంలో రైతు రాములు గ్రీన్‌నెట్‌ను ముక్కలుగా చేసి పెట్టారన్నారు. ఫలితం ఉంటుందన్నారు. – అశ్వాపురం, న్యూస్‌టుడే

ఇదేం చేతి కంపు..!



భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని చేతిపంపు వద్ద భరించరాని దుర్గంధం వెదజల్లుతోంది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన మురుగు ఇక్కడ చేరింది. ఇది పోయేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో పంపు చుట్టూ పెద్ద మడుగు ఏర్పడింది. ఐటీడీఏలో పని మీద వచ్చే వాళ్లు మంచినీళ్లకు దీన్ని ఉపయోగించలేకపోతున్నారు. సమస్యను గుర్తించామని త్వరలో పరిష్కరిస్తామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. – భద్రాచలం, న్యూస్‌టుడే

బంగారు బాటలు వేసుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్కే సైదులు

అశ్వాపురం, మణుగూరు సాంస్కృతికం, దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: దివ్యాంగులైన పిల్లలు అందరితో సమానంగా విద్యనభ్యసించి జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలని జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్కే సైదులు అన్నారు. మిట్టగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉపాధ్యాయులకు ప్రశస్థ యాప్‌పై బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఆర్థిక అధికారి ఎస్.శ్రీనివాస్, మండల ప్రాంతీయ అధికారి శంకర్, రిసోర్స్ పర్సన్‌లు అంజలి, ఝాన్సీరాణి, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మణుగూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో వీరస్వామి, దుమ్ముగూడెం మండలం పర్ణశాల హైస్కూల్‌లో ఎంఈవో సమ్మయ్య ప్రశస్థ కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

పినపాక, న్యూస్‌టుడే: ఏడూళ్లబయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు నాగయ్య తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.

దమ్మపేట, న్యూస్‌టుడే: మండలం నుంచి జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా పోటీలకు 195 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ కీసరి లక్ష్మీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అశ్వాపురం, న్యూస్‌టుడే: మామిళ్లవాయి గ్రామానికి చెందిన సోయం సత్యం(20) ఈనెల 23న పురుగు మందు తాగాడు. తొలుత భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తర్వాత పరిస్థితి విషమించడంతో కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్యశాలలో తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.

వరకట్నం వేధింపుల కేసు నమోదు

భద్రాచలం, న్యూస్‌టుడే: భార్యను వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్సై పీవీఎన్ రావు తెలిపిన వివరాల ప్రకారం... పదేళ్ల కిందట స్థానిక వెంకటేశ్వరకాలనీకి చెందిన బి.శాంతికి సాంబశివరావు అనే వ్యక్తితో వివాహం అయింది. మొదట్లో బాగానే ఉన్నప్పటికీ ఈ మధ్యకాలంలో తరచూ కట్నం కోసం వేధిస్తున్నాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండ మండలం సీతాయిగూడెం ఎదుళ్లవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అయ్యన్నపాలెం వద్ద మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్.ఐ. గంజి స్వప్న తెలిపారు. పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా పట్టుబడిన ట్రాక్టర్లను ఠాణాకు తరలించినట్లు బుధవారం ఆమె చెప్పారు.

మృతురాలి కళ్లు దానం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణానికి చెందిన రూపవతి అనే మహిళ(62) మంగళవారం రాత్రి ఇంటి వద్ద సాధారణ మరణం పొందారు. ఈమె కళ్లను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. హైదరాబాద్‌లోని డా.అగర్వాల్ కంటి బ్యాంక్‌కు చెందిన నిపుణుడు జానీ బుధవారం ఈమె కళ్లను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు.

2న ఆయిల్‌పాం గ్రోయెర్స్ సొసైటీ సమావేశం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పాం గ్రోయెర్స్ సొసైటీ సమావేశం అక్టోబరు 2న గిరిజన భవన్‌లో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పీవోను కలిసిన మానవ హక్కుల సభ్యులు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏలో పీవో రాహుల్‌ను బుధవారం జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు వంశీతేజ, కౌన్సిల్ సభ్యుడు వేణుగోపాలరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఏజెన్సీలో సమస్యలపై వారు పీవోతో చర్చించారు.

లాభాల వాటా చెల్లింపుపై తెబొగకాసం నిరసన

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సింగరేణి కార్మికులకు సంస్థ చెల్లించనున్న లాభాల వాటాలో జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం మణుగూరులోని జీఎం కార్యాలయం ఎదుట తెబొగకాసం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్, ఇజ్రాయిల్, పవన్, ఇమ్రాన్, ఏడుకొండలు పాల్గొన్నారు.

సినిమా హాళ్లలో సౌకర్యాలు కల్పించాలి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: సినిమా హాళ్లలో ప్రేక్షకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ తెదేపా మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షేక్ అజీం భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావుకు బుధవారం వినతిపత్రం అందించారు.

స్వామిని దర్శించుకున్న కార్పొరేషన్ ఛైర్‌పర్సన్

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామిని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కాల్వ సుజాత బుధవారం దర్శించుకున్నారు. అయ్యప్ప దేవస్థానం అన్నదానంలో పాల్గొన్నారు. నాయకులు శ్రీనివాసరావు, దయాకర్‌రావు, మల్లికార్జునరావు ఉన్నారు.

వివాదంపై విచారణ

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది క్వార్టర్స్‌లో ఓ సంచార వైద్యాధికారి-ఓ ఏఎన్ఎం కుటుంబ సభ్యుల మధ్య గత కొంతకాలం నుంచి జరుగుతున్న వివాదంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో రేపాక చైతన్య బుధవారం విచారణ జరిపారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

గుండాల, న్యూస్‌టుడే: ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి కోరారు. బుధవారం గుండాలలో గోడపత్రికలు ఆవిష్కరించారు. నాయకులు వెంకన్న, రవి, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

గుండాల, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్సై రాజమౌళి ఆకాంక్షించారు. బుధవారం గుండాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన గురుకుల కళాశాల, పాఠశాలలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కరకగూడెం, న్యూస్‌టుడే: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆధార్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తోలెం రమేష్ అన్నారు. నీలాద్రిపేట వలస ఆదివాసీ పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో గుడ్‌క్లాప్, సహస్ర గ్రూప్(హైదరాబాద్) సహకారంతో ఆధార్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం టిన్ రేకులషెడ్‌ను బుధవారం రమేష్ ప్రారంభించారు. పిల్లలకు పలకలను అందజేశారు.

సేంద్రియ ఎరువులు వినియోగించండి

గుండాల, న్యూస్‌టుడే: నేల ఆరోగ్యంగా ఉండడంతోపాటు పంట దిగుబడి అధికంగా పొందాలంటే భూసార పరీక్షతోపాటు సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు అన్నారు. బుధవారం గుండాల మండలం పడుగోనిగూడెం రైతువేదికలో భూసార పరీక్షలకు సంబంధించిన కార్డులను రైతులకు పంపిణీ చేశారు.

ఆటల్లోనూ ప్రతిభ చూపాలి: ఎమ్మెల్యే జారే


అశ్వారావుపేట గ్రామీణం: రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జారే

అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో ముందుండాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. ఎర్రగుంట జడ్పీ పాఠశాలలో రెండ్రోజులపాటు నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీల విజేతలకు బుధవారం ఆయన బహుమతులు అందజేశారు.

✦ దమ్మపేటలో ఈనెల 24న జరిగిన పాఠశాలల జోనల్ క్రీడా పోటీల్లో అథ్లెటిక్స్‌లో పది విభాగాల్లో అశ్వారావుపేట మైనార్టీ బాలికల గురుకులం, బీసీ బాలుర గురుకులం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విజేతలను ప్రిన్సిపాళ్లు సంగీత, రేణుకారాణి, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

✦ దత్తత గ్రామమైన చెన్నాపురంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకంతో పాటు ఎమ్మెల్యే కోటా నుంచి రూ.1.07 కోట్లు కేటాయించారు.

'లాభాల వాటా సాధించింది ఏఐటీయూసీ మాత్రమే'

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సింగరేణి కార్మికులకు లాభాల వాటా వచ్చేలా పోరాడి సాధించింది ఏఐటీయూసీ మాత్రమే అని ఎస్‌సీడబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. మణుగూరులో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక రకాల సమస్యలు గనుల్లో పేరుకుపోయామని, ఆపరేటర్ల భర్తీ సమస్య తీవ్రస్థాయిలో ఉందన్నారు. లాభాల వాటా విషయంలో యాజమాన్యాన్ని కలిసి దసరాకు ముందే కార్మికులకు వాటా ఇవ్వాలని చెప్పి పోరాడి సాధించామన్నారు. ఈ సమావేశంలో బ్రాంచి కార్యదర్శి రాంగోపాల్, ఉపాధ్యక్షులు రాంనర్సయ్య, నాయకులు ఈశ్వర్, రాములు, నాగరాజు, దుర్గ్యాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ పాత్ర మరువలేనిది

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రత్యేక తెలంగాణ సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర మరువలేనిదని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ప్రతిష్ఠించిన స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని బుధవారం పాయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ సాధన కోసం చేసిన మూడు పోరాటాల్లో లక్ష్మణ్ బాపూజీ ప్రముఖమైన పాత్ర పోషించారన్నారు. తహసీల్దారు రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు పీర్నాకి నవీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పాయం

✦ డివిజన్‌లో నిర్వహించిన పంట సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో నెలకొన్న ఇబ్బందుల గురించి వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు బుధవారం స్థానిక ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే తెల్లం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి శాయశక్తుల కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. చినబండిరేవు, కాశీనగరం, చిననల్లబెల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే వెంకట్రావు బుధవారం పర్యటించారు. చినబండిరేవు పీహెచ్‌సీని సందర్శించి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని పరిశీలించారు. మల్టీపర్పస్ వర్కర్స్‌కు పర్ణశాల వైద్యాధికారి రేణుకారెడ్డి చేస్తున్న వైద్య పరీక్షలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యురాలు తెల్లం సీతమ్మ, నాయకులు అబ్బులు, శివాజీ, వెంకటరమణారెడ్డి, చంటి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం

'మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి'


మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి కిశోర్‌రెడ్డి

అశ్వాపురం, న్యూస్‌టుడే: నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ ముందుకు వెళ్తోందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిశోర్‌రెడ్డి అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం అశ్వాపురంలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు భాజపా సభ్యత్వం తీసుకుని మోదీకి మద్దతు పలికేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్, ముస్కు శ్రీనివాసరెడ్డి, అయిలయ్య, వెంకటేశ్వర్లు, భిక్షపతి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: దేశాభివృద్ధి భాజపాతోనే సాధ్యం అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ అన్నారు. అశ్వారావుపేటలో పార్టీ సభ్యత్వ నమోదును ఆ కార్యక్రమ ప్రభావరి శ్రీవర్ధన్‌రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్, పానిశెట్టి వెంకటేశ్వర్లు, రాజేష్, ముసుగు శ్రీనివాస్, కుంజా ధర్మారావు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

భారాస బలోపేతానికి కష్టపడాలి

మణుగూరు సాంస్కృతికం, అశ్వాపురం, బూర్గంపాడు, కరకగూడెం, ములకలపల్లి, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో భారాసని అన్నివిధాలా బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మణుగూరులో బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో రేగా మాట్లాడారు. పార్టీ కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని, ప్రజల్లోకి పార్టీని తీసుకువెళ్లాలని సూచించారు. అతిత్వరలో భారాస మండల, పట్టణ నూతన కమిటీలతో పాటు అన్ని అనుబంధ సంఘాల కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. నాయకులు నాగేశ్వరరావు, వట్టం రాంబాబు, లక్ష్మణ్, యాదగిరిగౌడ్, నవీన్, కృష్ణ, రాము, ఆవుల నర్సింహారావు, తెబొగకాసం ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అశ్వాపురం, బూర్గంపాడు, కరకగూడెం, ములకలపల్లి మండలాల్లో స్థానిక భారాస నేతలు ప్రభుత్వ ఆసుపత్రులను పరిశీలించారు.


మణుగూరులో పార్టీ జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా

బధిరులకు వైద్య శిబిరం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ప్రత్యేక వికాస బాలుర పాఠశాల భద్రాచలంలో మండల లీగల్ సేల్ అథారటీ ఆధ్వర్యంలో చిన్నారులకు బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి భద్రాచలం ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రత్యేకావసరాల పిల్లలకు ఉన్న చట్టాలను వివరించారు. వారికి ఏదైనా సమస్య ఉంటే రాత పూర్వకంగా ఫిర్యాదు అందజేస్తే మండల న్యాయ సేవా సర్వీసు ద్వారా ఉచిత న్యాయ సలహాలు అందజేస్తామని వివరించారు. న్యాయవాదులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు పండ్లు అందజేస్తున్న వెంకటేశ్వర్లు, తదితరులు

ప్రజలు, పోలీసులు కలిసి పని చేయాలి

కరకగూడెం, న్యూస్‌టుడే: సమాజంలో శాంతిభద్రతల కోసం ప్రజలు, పోలీసులు కలిసి పని చేయాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. వలస ఆదివాసీ గ్రామమైన రేగళ్లలో బుధవారం ఆయన పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న మంచిని గమనిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అలాగే అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వద్దని అటువంటి వారు ఎవరైనా వస్తే మాకు వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం కరకగూడెం పోలీస్ ఠాణాను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, స్థానిక ఎస్సై రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.


రేగళ్లలో ఆదివాసీలతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పొంగిన వాగులు.. మునిగిన దారులు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఊట్లపల్లి సమీపంలోని వెంకమ్మ చెరువు మత్తడి పొంగి ప్రవహిస్తోంది. దీంతో దిగువన వాగొడ్డుగూడెం సమీపంలో వంతెనపై నుంచి వరద ప్రవహిస్తుంచింది. ఆరు గిరిజన గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయాయి.


వాగొడ్డుగూడెం వద్ద వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు



కార్యక్రమంలో మాట్లాడుతున్న త్యాగరాజన్, పక్కనే రజాక్ తదితరులు

కార్మికులకు లాభాల్లో అత్యధిక శాతం వాటా

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: గతంలో చెల్లించని విధంగా ప్రస్తుత ప్రభుత్వం సింగరేణి లాభాల్లో వాటాగా 33 శాతాన్ని చెల్లించిందని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్ అన్నారు. ఏరియా వర్క్‌షాపులో బుధవారం ఏర్పాటైన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తార్‌పాషా, రజాక్, ఆల్బర్ట్, రాజేశ్వరరావు, గౌస్, నటరాజ్, అశోక్, ఐమన్స్, భిక్షపతి, తిరుపతి పాల్గొన్నారు.

ఇల్లెందు గ్రామీణం: సింగరేణి కార్మికులకు వాస్తవ లాభాల నుంచి 33 శాతం వాటాను చెల్లించాలని జీఎం జాన్ ఆనంద్‌కు బుధవారం భారాస, తెబొగకాసం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రంగనాథ్, దిండిగల రాజేందర్, జాఫర్‌హుస్సేన్, నబి, రాజేష్ పాల్గొన్నారు.

కొత్తగూడెం సింగరేణి: లాభాల్లో వాటాగా రూ.5 వేలను ఒప్పంద కార్మికులందరికీ చెల్లించాలని ఇఫ్టూ కార్యదర్శి పి.సతీష్ డిమాండ్ చేశారు. బంగ్లోస్, రైటర్‌బస్తీ, బాబూ క్యాంపు ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన ద్వార సమావేశాల్లో ఆయన మాట్లాడారు. శంకర్, సుజాత, సురేష్, శారద, ఆదిలక్ష్మి, మణెమ్మ, మల్లేశ్, రాధ, కృష్ణ పాల్గొన్నారు.

సమాచారం నమోదుపై అవగాహన

టేకులపల్లి: దివ్యాంగ చిన్నారులకు ఉపయోగపడే ప్రశస్త్ యాప్‌పై సులానగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. మండలంలో 400 మందికి శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ జగన్ తెలిపారు. ఈ నెల 27వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

పాల్వంచ, న్యూస్‌టుడే: దివ్యాంగులైన విద్యార్థుల వివరాలను 'ప్రశస్త్' యాప్‌లో నమోదు చేయాలని, తద్వారా వారికి ప్రభుత్వ పథకాల లబ్ధి కలుగుతుందని జిల్లా సమ్మిళిత విద్యా సమన్వయకర్త సైదులు అన్నారు. పాల్వంచ బొల్లోరిగూడెం జడ్పీ పాఠశాలలో 'యాప్'పై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో బుధవారం అవగాహన కల్పించారు. కోర్స్ డైరెక్టర్ ప్రకాశ్‌రావు, ఆర్పీలు పాల్గొన్నారు.

నిచ్చెనలు శిథిలం.. నీరు మలినం

పాల్వంచ గ్రామీణం, చుంచుపల్లి, న్యూస్‌టుడే

ఈ సీజన్‌లో కలుషిత నీటి జనిత వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయి. సుమారు 70 శాతం మంది సంబంధిత రోగాలతో బాధపడుతూ ఆసుపత్రులకు వస్తున్నట్లు వైద్యులు తెలిపారు. అపరిశుభ్ర నీటితో డయేరియా, వాంతులు, టైఫాయిడ్ జ్వరాలు సంభవిస్తున్నాయి. ఈ క్రమంలో సుజాతనగర్, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి గ్రామాలకు నీటిని సరఫరా చేసే ఉపరితల భాండాగారాలను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు. సుజాతనగర్, చుంచుపల్లి మండలాల్లో ట్యాంకుల పరిశుభ్రత చేయిస్తున్నట్లు పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. మరికొన్ని చోట్ల ఈ చర్యలు వారం వారం చేపట్టాల్సి ఉంది.



మామిడిగూడెంలోని మంచినీటి ట్యాంకు

పాల్వంచ మండలంలో 36 పంచాయతీలు, 96 ఆవాస గ్రామాలున్నాయి. ట్యాంకులు 60, నల్లాలు 7,800, బోర్లు 472 ఉన్నాయి. కొన్నింటికి నిచ్చెనలు సక్రమంగా లేవు. ప్రతి శుక్రవారం ట్యాంకులు కడగాల్సి ఉంది. కానీ మూడు వారాలకోసారి కడుగుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో కొన్ని ట్యాంకులకు బిగించిన ఇనుప నిచ్చెనలు మరమ్మతులకు గురయ్యాయి. పంచాయతీ సిబ్బంది పైకి ఎక్కితే విరిగిపోయేలా ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసైనా ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీదేవిపల్లి మండలంలో..

మండలంలోని మొత్తం 82 గ్రామాల్లో సుమారు 75 నీటి ట్యాంక్‌లు నిర్మించారు. సుమారు 40 వేల మంది జనాభా దాహార్తిని తీర్చేందుకు శుద్ధ జలాలు సరఫరా చేస్తున్నారు. కానీ, నెలలో మూడుసార్లు శుభ్రం చేయాల్సిన ట్యాంకులను సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఉపరితల భాండాగారాలను శుభ్రం చేస్తే.. ఆ తేదీని ట్యాంకుపై వేయాలి. ఇదెక్కడా జరగడం లేదు. పలు ట్యాంకుల నుంచి నివాసాలకు సరఫరా చేసే శుద్ధ జలం అపరిశుభ్రంగా ఉంటోంది. దీనికి తోడు కొన్ని గ్రామాల్లో అరకొరగా సరఫరా అవుతుండటంతో తాగు నీటి కోసం చేతి పంపులపై ఆధారపడుతున్నారు.



బంగారుచెలక పంచాయతీ తిప్పగుట్టలోని నీళ్ల ట్యాంక్ దుస్థితి ఇది

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689



సమస్య: మేదరబస్తీ ఏరియాలో తడి, పొడిచెత్త వేసే ప్లాస్టిక్ డబ్బాలు పాడైపోయాయి. రోడ్డుపై వ్యర్థాలు పడేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. - స్థానికులు

సమాధానం: తడి, పొడి, బయోవేస్టేజ్ వ్యర్థాలు వేసేలా కూడళ్లలో మళ్లీ చెత్త డబ్బాలను ఏర్పాటు చేస్తాం. నివాసాల్లో వెలువడే చెత్తను ట్రాలీలకు ఇచ్చేందుకు ప్రయత్నించాలి. – వీరభద్రాచారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

తిలక్‌నగర్ పంచాయతీ పరిధిలో పలు చోట్ల వీధిదీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నాం. - స్థానికుడు, తిలక్‌నగర్

✔ వీధిలైట్లు ఎక్కడ వెలగటం లేదో పరిశీలించి పరిష్కరిస్తాం. - చిరంజీవి, ఎంపీవో

– ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

జూలూరుపాడు కప్పలకుంట చెరువు సమీపంలోని తాగునీటి చేతిపంపు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. - శ్రీనివాసరావు

✔ చేతిపంపు పరిసరాల్లో పిచ్చిమొక్కలు తొలగిస్తాం. - హరిబాబు, కార్యదర్శి

– జూలూరుపాడు, న్యూస్‌టుడే


వాటర్ ట్యాంక్ శుభ్రం



స్పందనకు వందనం

చుంచుపల్లి, న్యూస్‌టుడే: త్రీఇంక్లైన్ పంచాయతీ వాటర్ ట్యాంక్ శుభ్రం చేయాలని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మిని కోరారు. ఆమె వెంటనే స్పందించి సిబ్బందితో ట్యాంక్‌ను బ్లీచింగ్‌తో బుధవారం శుభ్రం చేయించారు.

అడవి కాదు.. పట్టణ వనం!



ఈ చిత్రంలో కనిపించేది జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతం అనుకుంటే పొరపాటే. పాల్వంచ టెరిటోరియల్ ఆధ్వర్యంలో బసవతారకకాలనీలో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు విహంగ వీక్షణమిది. ఇక్కడి వాచ్ టవర్ పైనుంచి చూస్తే పచ్చందాల చెట్లు, పక్కన గుట్టలు ప్రకృతి సొగసుకు ప్రతిబింబంలా కనిపిస్తున్నాయి.

– పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

బడి చుట్టూ నీరు..



వర్షాలు పడినప్పుడల్లా అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లేందుకు చిన్నారులు, తల్లులు అవస్థ పడుతున్నారు. కొద్దిపాటి వాన కురిస్తే తిలక్‌నగర్ పంచాయతీ బొల్లినగర్ కేంద్రం చుట్టూ వర్షపు నీరు చేరుతోంది. రోజులపాటు అలాగే ఉంటుండటంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. కేంద్రంలోకి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఎంపీవో చిరంజీవిని వివరణ కోరగా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

- ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

శిక్షణ నైపుణ్యాలతో సమస్యల్ని పరిష్కరించాలి

చుంచుపల్లి, న్యూస్‌టుడే: గ్రామ మంచినీటి సహాయకులు ప్రభుత్వ శిక్షణను సద్వినియోగం చేసుకుని.. గ్రామాల్లో తలెత్తే తాగునీటి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని జడ్పీ సీఈవో కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. 'నల్ జల్ మిత్ర పథకం'లో భాగంగా మండలంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన శిక్షణను ఆయన బుధవారం సందర్శించారు. ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎంపీవో సత్యనారాయణ, ఏఈ వసంత పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో కె.చంద్రశేఖర్‌రావు

అటవీ డివిజన్‌లో ఇన్‌ఛార్జుల నియామకం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు అటవీ శాఖ డివిజనల్ అధికారి(ఎఫ్‌డీవో) పూర్తి అదనపు బాధ్యతలను(ఎఫ్ఏసీ) కొత్తగూడెం ఎఫ్‌డీవో కోటేశ్వరరావుకు అప్పగిస్తూ సీసీఎఫ్ భీమానాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. కోటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచ: ఎస్సీ విద్యార్థులు ఉపకార వేతనాలకు https//telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ అభివృద్ధి అధికారి దాసరి అనసూర్య బుధవారం తెలిపారు. ప్రీమెట్రిక్‌కు 5-8, 'రాజీవ్ విద్యా దీవెన'కు 9, 10వ తరగతి అర్హులన్నారు.

నీట్ ఫలితాల్లో ప్రతిభ



పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ పట్టణానికి చెందిన **కాంపెల్లి కిరణ్మయి** నీట్ ఫలితాల్లో 128 ర్యాంకు సాధించడంతో స్థానికులు, బంధువులు ఆమెను అభినందించారు. కాళోజీ మెడికల్ యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాల్లో ఉత్తమ ర్యాంకును సొంతం చేసుకున్న కిరణ్మయి పదిలో 10 జీపీఏ, ఇంటర్మీడియట్ బైపీసీలో 973 మార్కులు సాధించినట్లు ఆమె తల్లిదండ్రులు కనకేశ్, సంధ్య తెలిపారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

టేకులపల్లి: కొప్పురాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులను ఎంఈఓ జగన్ బుధవారం పంపిణీ చేశారు. ఓ స్వచ్ఛంద సంస్థ వితరణతో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, మోతీలాల్, రమేష్‌బాబు, హెచ్ఎం బాలాజీ పాల్గొన్నారు. ★ టేకులపల్లి ఎంఈఓగా ఎ.జగన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

'ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన విధానాలు'

ఇల్లెందు గ్రామీణం: దేశం బలమైన శక్తిగా నిలబడటానికి 1991 నాటి నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలే కారణమని ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీ జీఎన్ఆర్ కళాశాల అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎం.పిచ్చయ్య అన్నారు. 'నూతన పారిశ్రామిక విధానాలు-ముఖ్యాంశాలు' అనే అంశంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సదస్సు జరిగింది. డాక్టరేట్ సాధించిన పిచ్చయ్యను ప్రిన్సిపల్ వై.చిన్నప్పయ్య సన్మానించారు.

సత్తా చాటిన విద్యార్థులు

టేకులపల్లి: కొత్తగూడెంలో ఈ నెల 23, 24న జరిగిన జోనల్ క్రీడా పోటీల్లో బేతంపూడి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ధారావత్ శ్రీజ (కబడ్డీ), బోడ సాయికుమార్ (400, 600 మీటర్ల పరుగు)లు ప్రతిభచూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని హెచ్.ఎం. తారాసింగ్ బుధవారం తెలిపారు. షాట్‌పుట్‌లో అక్షయ్, 200 మీటర్ల పరుగులో జ్యోతిక తృతీయ బహుమతి సాధించారన్నారు. వారిని, పీఈటీ నాగలక్ష్మిని అభినందించారు.

జీఓ నం.25ను ఉపసంహరించుకోవాలి

టేకులపల్లి: సర్దుబాటు పేరుతో ప్రభుత్వం ఉపాధ్యాయులను ఇబ్బందులను గురిచేయొద్దని టీఎస్‌టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. సులానగర్ జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ, డీఏలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సారయ్య, పూల్‌సింగ్, వెంకట్రావు, సర్వన్, మంగీలాల్ పాల్గొన్నారు.

అటవీ శాఖ దాడులు ఆపాలి: సీపీఎం

పాల్వంచ పట్టణం: పోడు భూముల పేరుతో అటవీ శాఖ అధికారులు గిరిజనులపై చేసే దాడులను ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. సీపీఎం శాఖ మహాసభను మండలంలోని బంద్రుగొండ, కోయగట్టు గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. నూతన కార్యదర్శులను ఎన్నుకున్నారు. అన్నవరపు సత్యనారాయణ, కొండబోయిన వెంకటేశ్వర్లు, పాకాల వెంకట్రావు, రాందాస్ పాల్గొన్నారు.

'పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత'

ఇల్లెందు గ్రామీణం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. జీఎం కార్యాలయం, ఏటీబీ సెల్ ఆవరణలో పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, జీవీ మోహన్‌రావు, రవికుమార్, కిశోర్ పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతానికి వినతి

ఇల్లెందు గ్రామీణం: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 30న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న కోరారు. ఒడ్డుగూడెం, ముకుందాపురం, రొంపేడులో గోడపత్రికలను ఆవిష్కరించారు.

వైద్య సిబ్బందిని నియమించాలి

టేకులపల్లి: సులానగర్ పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలను నియమించాలని భారాస మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వరప్రసాద్, బాలు డిమాండ్ చేశారు. పార్టీ పిలుపులో బుధవారం పీహెచ్‌సీని సందర్శించారు. రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మాతాశిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం: కోరం

టేకులపల్లి, న్యూస్‌టుడే: మాతాశిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బోడు రైతువేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పోషకాహార మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. తల్లి గర్భందాల్చిన సమయం నుంచే అంగన్‌వాడీ కేంద్రాలు చిత్తశుద్ధితో సంరక్షణ బాధ్యతలు భుజానికెత్తుకుంటున్నాయన్నారు. పోషకాహార ప్రదర్శనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశనం నిర్వహించారు. తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ రవీందర్‌రావు, సీడీపీఓ కేఎం తార, సీహెచ్ఓ పార్వతి పాల్గొన్నారు.

'ఎంసీహెచ్‌లో సిబ్బంది కొరత..'

కొత్తగూడెం వైద్యవిభాగం: రామవరం మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని భారాస నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు ఎంసీహెచ్‌ను వారు బుధవారం సందర్శించారు. వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సరిపడా వైద్యులు, సిబ్బంది లేరని, ఔషధాల కొరత ఉందని పలువురు వాపోయారు. శుద్ధజలాలూ అందుబాటులో లేవన్నారు. చిన్న సమస్యలకూ వరంగల్, ఖమ్మం రిఫరల్ చేస్తూ గర్భిణుల ప్రాణాలతో చెలగాటమాడొద్దని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అనుదీప్, మాజీ ఎంపీపీ బదావత్ శాంతి, శంకర్, జయరాజు, ఐలయ్య పాల్గొన్నారు.



చిన్నారికి అన్నప్రాశన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

'అంగవైకల్యం అడ్డు కాదు'



బధిరులకు వైద్యచికిత్సలు చేయిస్తున్న న్యాయమూర్తి జి.భానుమతి

కొత్తగూడెం న్యాయవిభాగం: దివ్యాంగులకు వైకల్యం అడ్డుకాదని, ఏ పరిస్థితులెదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. 'ప్రపంచ బధిరుల దినోత్సవం' సందర్భంగా బాబుక్యాంపులో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురికి వినికిడి యంత్రాలను న్యాయమూర్తి చేతుల మీదుగా అందజేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.రాధామోహన్, డా.శ్యాంసన్, ఉపాధ్యాయుడు సిద్ధయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి: కలెక్టర్

పాల్వంచ, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాల్లో భాగంగా పాల్వంచ పురపాలకంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సిబ్బందిపై పనిభారాన్ని తగ్గించేందుకు సాంకేతిక పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) విద్యాచందన, కమిషనర్ ఢాకునాయక్, తహసీల్దార్ వివేక్, డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్, డీసీహెచ్ఎస్ రవిబాబు, డీఈ స్వరూపారాణి, పారిశుద్ధ్య అధికారి లక్ష్మణ్‌రావు, పర్యావరణ ఈఈ ఫరీద్ పాల్గొన్నారు.

★ పాల్వంచ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి రోగులకు అందే సేవలు, డ్రైనేజీ వ్యవస్థ, తదితర వసతులను పరిశీలించారు. కలెక్టర్ వెంట సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్ఎంఓ సోమరాజుదొర తదితరులు ఉన్నారు.

కొత్తగూడెం పట్టణం: పురపాలక పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కమిషనర్ శేషు, కౌన్సిలర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్: రేగళ్ల, పెనగడప, సర్వారం గ్రామాల్లో పంచాయతీ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సందర్శించారు. వైద్యాధికారులు డా.స్వప్న, డా.నేహా అంబ్రిన్ ఎంపీడీవోలు చలపతిరావు, అశోక్‌కుమార్, ఎంపీవోలు శ్రీనివాసరావు, సత్యనారాయణ, శ్రీనివాస్, ఏఈ వెంకటస్వామి సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచ పట్టణం: తోగ్గూడెం వాటర్‌గ్రిడ్‌లో జరిగిన 'సఫాయి మిత్ర సురక్ష శిబిరం'ను ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఈఈ తిరుమలేశ్‌లు సందర్శించారు. వైద్యాధికారులు జి.రాజు, కృష్ణమూర్తి, ఎంపీవో నారాయణ, డీఈ శివయ్య, ఏఈ నీలావతి పాల్గొన్నారు.

టేకులపల్లి: గోల్యాతండా, టేకులపల్లి కార్మికులకు పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. మల్టీ విటమిన్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యదర్శి దీప్తి పాల్గొన్నారు.

ఇల్లెందు గ్రామీణం: రొంపేడు పీహెచ్‌సీలో 13 పంచాయతీల పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు వైద్యాధికారి కవిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ ధన్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న 80 మంది మల్టీపర్పస్ వర్కర్లకు మండల పరిషత్ కార్యాలయంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీవో తులసీరామ్ పాల్గొన్నారు.



పాల్వంచ: మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్



పెనగడప పీహెచ్‌సీలో కార్మికులకు మందుల పంపిణీ..

చికిత్స పొందుతూ రైతు మృతి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: చెన్నంగలగడ్డకు చెందిన యువ రైతు ఆలె రవి(29) చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. తన అరెకరంతో పాటు మరో ఎకరం కౌలుకు తీసుకొని పత్తి వేయగా.. ఇటీవల వర్షాలకు దెబ్బతింది. మనస్తాపంతో మంగళవారం పురుగు మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. తల్లి సమ్మక్క ఇచ్చిన ఫిర్యాదుతో హెడ్‌కానిస్టేబుల్ తులసీరాం కేసు నమోదు చేశారు.

ప్రేమ పేరుతో మోసం.. వ్యక్తికి రిమాండ్

పాల్వంచ గ్రామీణం: బాలికను ప్రేమించానని నమ్మించి ఇంట్లోంచి తీసుకెళ్లిన ఓ వ్యక్తిని పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. పాల్వంచకు చెందిన బాలిక కొత్తగూడెంలో ఇంటర్ చదువుతోంది. ఆమెను ప్రైవేటు ఉద్యోగి సురేశ్ ప్రేమ పేరుతో నమ్మించి ఈ నెల 17న ఇంట్లోంచి తీసుకెళ్లాడు. బాధితురాలి తల్లి ఈ నెల 18న పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఎస్సై కేసు నమోదు చేశారు. చరవాణి ఆధారంగా కొత్తగూడెంలో ఉన్నట్లు గుర్తించి నిందితుణ్ని రిమాండ్‌కు తరలించారు.

పశువులను తప్పించబోయి.. ప్రమాదానికి గురైన '108'

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పశువులను తప్పించే క్రమంలో ఓ '108' వాహనం ప్రమాదానికి గురైంది. టేకులపల్లి మండలానికి చెందిన గర్భిణిని రామవరం ఎంసీహెచ్‌కి తరలిస్తున్న పైలట్.. ఆసుపత్రికి సమీపంలోని కూడలిలో పశువులు అడ్డురావడంతో ఒక్కసారిగా పక్కకు తిప్పాడు. ఆ సమయంలో రోడ్డు పక్కనున్న విగ్రహం దిమ్మెను వాహనం ఢీకొంది. అదృష్టవశాత్తు వాహనంలో ఉన్నవారంతా క్షేమంగా బయటపడగా వాహనం దెబ్బతింది. స్థానిక పోలీసులు 108ని స్టేషన్‌కి తరలించారు.

స్వాగత వేడుకల సందడి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వనజ

కొత్తగూడెం విద్యావిభాగం: లక్ష్మీదేవిపల్లి మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాగత వేడుకను బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ వనజ జ్యోతిని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బత్తుల కృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

'పింఛను అదాలత్' త్రైపాక్షిక సమావేశం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: పింఛను అదాలత్‌పై కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో త్రైపాక్షిక సమావేశం బుధవారం జరిగింది. పింఛను క్లెయిమ్‌లను సత్వరం పరిష్కరించాలని సీఎంపీఎఫ్, సింగరేణి అధికారులను గుర్తింపు సంఘం నాయకులు కోరారు. సీఎంపీఎఫ్ స్లిప్పులు, సవరించిన ఉత్తర్వు కాపీల పంపిణీ మొదలైన అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో జీఎం (ఫైనాన్స్) సుబ్బారావు, జీఎంలు శామ్యూల్ సుధాకర్, కవితానాయుడు, సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.కనకమ్మ, గుర్తింపు సంఘం నాయకుడు రమణమూర్తి, ప్రాతినిధ్యసంఘం నాయకుడు పీతాంబరరావు పాల్గొన్నారు.

28న 'గూడెం'లో నిరసన ప్రదర్శన

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: తిరుమలలో మహాప్రసాదం తయారీకి కల్తీ నూనెలు వాడటంపై ప్రతి ఒక్కరూ స్పందించాలని సనాతన హిందూ ధర్మ ఐక్య వేదిక ప్రతినిధులు ఇంద్రగంటి శంకరప్రసాద శర్మ, కన్నెగంటి కృష్ణమూర్తి, కొదమసింహం పాండు రంగాచార్యులు అన్నారు. రైటర్ బస్తీ గణేష్ టెంపుల్‌లో ధార్మిక సంస్థల సభ్యులు, పురోహితులతో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. తిరుమల అపచారంపై ఈ నెల 28న ఉదయం 9 గంటలకు ఎంజీ రోడ్ గణేష్ టెంపుల్ నుంచి విద్యానగర్ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు.

అడవిపై నిఘా అంతంతే..?

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

కిన్నెరసాని పర్యాటక కేంద్రంపై అధికారుల శీతకన్ను వీడటం లేదు. ఇక్కడి పర్యాటకులకు కనీస సదుపాయాలు లేకపోగా, అడవిలో జరిగే అక్రమాలకూ అడ్డుకట్ట పడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక అధికారి ఇక్కడ అందుబాటులో ఉండకపోవడం దీనికో కారణం అనే వాదన ఉంది.

కిన్నెరసానిలో రూ.35 లక్షల వ్యయంతో యానంబైలు రేంజర్ క్వార్టర్‌ను నిర్మించారు. ఈ నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తోంది. కానీ, అధికారికంగా ప్రారంభించడం లేదు. విద్యుత్తు సౌకర్యం, నీటి సౌకర్యం లేక ఆలస్యం జరుగుతోందన్నది అధికారుల వాదన. రేంజర్ స్థాయి అధికారి స్థానికంగా ఉంటే కలప, ఇసుక అక్రమ, ముఖ్యంగా వన్యప్రాణుల వేటగాళ్లను కట్టడి చేయవచ్చు. అడవుల్లో ఎక్కడ అలికిడి వినిపించినా.. తక్షణం గ్రామాల్లోకి సమాచారం వ్యాపిస్తోంది. వారి ద్వారా వన్యప్రాణుల వేటగాళ్ల జాడను సులభంగా గుర్తించవచ్చు. ఇతర అక్రమార్కులను సైతం సత్వరం అదుపులోకి తీసుకోవచ్చు. కానీ ప్రస్తుతం రేంజర్ పాల్వంచలో ఉంటున్నారు. దీంతో ఏదైనా సమాచారం ఆయన చేరే లోపే జరగాల్సిన నష్టం జరుగుతోంది.



నిరుపయోగంగా రేంజర్ క్వార్టర్..

ఉన్నతాధికారులు స్పందించి క్వార్టర్‌కు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అటవీప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఈ సమస్యపై రేంజర్ కవితా మాధురిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. అధికారికంగా నివాసం ప్రారంభం కాకపోవడంతో అక్కడ ఉండటం లేదన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

మాదకద్రవ్యాల మహమ్మారిని పారదోలుదాం

టేకులపల్లి, న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాల బారినపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని టేకులపల్లి ఎస్సై పి.సురేశ్ సూచించారు. డ్రగ్స్ అనర్థాలపై టేకులపల్లిలో బుధవారం అవగాహన కల్పించారు. గంజాయి సమాచారం తెలిస్తే డయల్100కు సమాచారం ఇవ్వాలన్నారు.

జూలూరుపాడు: ఎస్సై రాణాప్రతాప్ ఆధ్వర్యంలో జూలూరుపాడులోని చంద్రుగొండ క్రాస్‌రోడ్డు, పాపకొల్లు క్రాస్‌రోడ్డు వద్ద డ్రగ్స్ నిర్మూలనపై యువతకు అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది వెంకటేశ్వర్లు, సురేశ్ పాల్గొన్నారు.



టేకులపల్లి: అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేశ్

లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలను పాడుచేసుకోవద్దని స్థానిక ఎస్సై రమణారెడ్డి అన్నారు. మత్తు అనర్థాలపై మండలంలోని కృష్ణవేణి, నలంద, వివేవర్ధిని కళాశాలల్లో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. అంతకు ముందు ఇల్లెందు అడ్డరోడ్డు వద్ద ఆర్టీసీ బస్సులు, వ్యాన్‌లకు పోస్టర్లు అంటించారు. ఏఎస్సై బీమా, హెడ్ కానిస్టేబుల్స్ రఘురాంరెడ్డి, రఘు పాల్గొన్నారు. మత్తు అనర్థాలపై చుంచుపల్లి మండలం బాబుక్యాంప్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎస్సై ఎం.రవికుమార్ అవగాహన కల్పించారు.



చుంచుపల్లి: బాబుక్యాంప్ పాఠశాలలో ఎస్సైరవికుమార్..